క్లుప్తంగా

కొణతనపాడులో కంటి వెలుగు శిబిరం



కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు కొణతనపాడులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం మంగళవారం నిర్వహించారు. ఉప్పులూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ 60 ఏళ్లు నిండిన 78 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలను గుర్తించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.కుసుమ, హెచ్‌ఎం వి.నాగరాజు, పి.సరిత, బి.వాణి పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకు రీ సర్వే

కంకిపాడు: భూముల పరిరక్షణకు రీ సర్వే దోహదపడుతుందని తహసీల్దార్ టీవీ సతీష్ అన్నారు. చలివేంద్రపాలెం, దావులూరు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా భూ యజమానులకు రీ సర్వేపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రీ సర్వే చేసే విధానం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సదస్సులో తహసీల్దార్ సతీష్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన భూములకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. గ్రామ కంఠాలను కొలిచి హద్దులు నిర్ణయించడం, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, కచ్చితమైన కొలతలతో భూ యజమానులకు భూమిపై స్పష్టత వస్తాయన్నారు. రైతులకు కావాల్సిన అడంగల్స్, మ్యాప్, ఆర్‌ఓఆర్ 1 బీ కాపీలు సులభంగా అందుతాయన్నారు. రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కొండా రామిరెడ్డి, బొమ్మారెడ్డి వాసు, ప్రొద్దుటూరు సొసైటీ చైర్మన్ బీహెచ్ రమేష్‌రెడ్డి, కుందేరు సొసైటీ మాజీ చైర్మన్ కె.జైపాల్‌రెడ్డి, వీఆర్‌ఓ నాగమణి పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

రామవరప్పాడు: ఆపదలో ఉన్న బాలల సంరక్షణ మనందరి బాధ్యతని పటమట సీఐ కాశీవిశ్వనాథ్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చైల్డ్‌లైన్, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్, గ్రామ సచివాలయం మహిళా పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బాలలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ బాలలకు విద్య అందించడం వారి ప్రాథమిక హక్కు అన్నారు. బాలలకు ఎదైనా ఆపద ఎదురైతే చైల్డ్ లైన్ 1098, పోలీసు 100, 112కు వెంటనే ఫోన్ చేసి రక్షణ పొందవచ్చని తెలిపారు. మహిళా పోలీస్ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ నీలా శాంతి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు ఆడపిల్లలకు చైల్డ్ మ్యారేజెస్ చేయకూడదని ఎవరైనా అతిక్రమిస్తే 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్ బాలల సంరక్షణ, అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అరుణ మేరీ, ఎస్సై విక్రమ్, సచివాలయం మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్‌గా జాహ్నవి

విజయవాడరూరల్: రూరల్ మండల తహసీల్దార్‌గా పి.జాహ్నవిని నియమిస్తూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జాహ్నవి ప్రస్తుతం సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్) కార్యాలయంలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను ట్రయినింగ్ తహసీల్దార్‌గా రూరల్ మండలంలో విధులు నిర్వహించనున్నారు. ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ఆర్‌బీకేల ద్వారా యూరియా సరఫరా

గన్నవరం రూరల్: ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం రైతాంగానికి యూరియాను సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజస్వి చెప్పారు. మంగళవారం మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి గ్రామాల్లో రైతాంగానికి ఆర్‌బీకేల ద్వారా అందజేస్తున్న యూరియా సరఫరాను ఆమె పర్యవేక్షించారు. మొక్కజొన్న సాగవుతున్న గ్రామాల్లో రైతాంగానికి అందుబాటులో యూరియా ఉంచామన్నారు. సూరంపల్లిలో 25మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. వీఏఏ రవితేజ పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు చర్యలు



యనమలకుదురులో రోడ్లు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: యనమలకుదురులో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రోడ్లు మరమ్మతులకు చర్యలు చేపట్టామని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. ఆయన మంగళవారం యనమలకుదురులో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ లాకుల, కనకదుర్గగుడి, ప్రధాన రహదారి, శివాలయం రోడ్లు మరమ్మతులు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ రాజారావు, వర్క్ సూపర్‌వైజర్ పోతురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



చోడవరంలో గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మంగళవారం చోడవరంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందించి గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సారథి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అవినీతి లేకుండా అమలు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు సచివాలయంలో దరఖాస్తు చేస్తే అర్హత ప్రకారం అందుతాయని తెలిపారు. నేడు విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యతో పాటు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, విదేశీ విద్య ఖర్చును ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. కార్పొరేట్ వైద్యం కూడా అందుబాటులో ఉందన్నారు.

పసలేని విమర్శలు..

ప్రతిపక్ష టీడీపీ నేతలు ప్రభుత్వంపై పసలేని విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఖండించారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంటే టీడీపీ నేతలు భరించలేక పోతున్నారని ఆరోపించారు.

జగనన్న పాలనలో పేదలు సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉంటే టీడీపీ ఆరోపిస్తున్నట్లు బాదుడే బాదుడు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాకర్ల వెంకటత్నం, వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, చాగర్లమూడి బాలకోటేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు పోతర్లంక సువార్త, చోడవరపు నిర్మల, లింగాల సాంబశివరావు, కొడాలి విష్ణు, కొత్తూరు సాగర్, నేతలు శీలం రవి చంద్, పి. రవి, చోడవరపు రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో ఆకస్మిక తనిఖీ



చైర్మన్ శ్రీనివాస్ చౌదరితో, ఉద్యోగులతో చర్చిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ విజయలక్ష్మి

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద పీఏసీఎస్‌ను మంగళవారం సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ డి.విజయలక్ష్మి ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలన చేశారు. సహకార బ్యాంకు చైర్మన్ మేడసాని శ్రీనివాస్ చౌదరితో ఆమె మాట్లాడారు. ఉద్యోగులతో సమావేశమై క్యాష్ బ్యాలెన్స్ ప్రతిరోజూ బ్యాంకుకు పంపాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆడిట్ పూర్తి చేయాలని చెప్పారు. రైతులకు పారదర్శకంగా సేవలందించాలన్నారు. ఆడిటింగ్ తర్వాత రైతులకు డివిడెంట్ పంపిణీ చేస్తామని చెప్పారు. సహకార శాఖ ప్రొసీడింగ్స్‌ను పాటించాలన్నారు. ఆడిటర్లు, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలన



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న రాజేంద్రప్రసాద్

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటగదిని పరిశీలించి స్టాక్ బుక్‌లను తనిఖీ చేశారు. వంటశాల, భోజనశాల వద్ద పరిశుభ్రతను పాటించాలని, ప్రభుత్వం నిర్ణయించిన జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు. టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో సమావేశమైన రాజేంద్రప్రసాద్ బాలల హక్కులు, భద్రతపై వివరించారు. హెచ్‌ఎం మనూజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దంత వైద్యకళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

గన్నవరం రూరల్: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఏపీ చాప్టర్ ఆధ్వర్యాన దంత వైద్యులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఓడీ డాక్టర్ కోటేశ్వరరావు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. నోరు, ముఖం, దవడల ఆపరేషన్ల విషయంలో విద్యార్థులకు అవగాహన పెంచి వారిలోని సృజన వెల్లడి కావడానికి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నాటక రంగ చరిత్రను భావితరాలకు అందించాలి



సభలో మాట్లాడుతున్న దేవినేని కిషోర్ బాబు

విజయవాడ కల్చరల్: తెలుగు నాటక రంగ చరిత్రను భావితరాలకు అందించాలని నాగార్జున కళాపరిషత్ అధ్యక్షుడు దేవినేని కిషోర్‌బాబు అన్నారు. శిల్పా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం శిల్పా ఫౌండేషన్ ఆధ్వర్యాన సంస్థ వెబ్‌సైట్, నాటక రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కారం, నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవినేని కిషోర్‌బాబు మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి సుదీర్ఘమైన చరిత్ర ఉందని, దానిని పరిరక్షించుకోవాల్సిన అవసముందన్నారు. తెలుగు నాటకాలను భావి తరాలకు అందించేందుకు కృషి చేస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. తెలుగు నాటకాల గొప్పతనాన్ని చెప్పారు. ట్రస్ట్ చైర్మన్ భాస్కరరావు సంస్థ లక్ష్యాను వివరించారు. సమావేశంలో ఎక్స్‌రే సాహిత్య సంస్థ కార్యదర్శి, బోడి ఆంజనేయరాజు, నాటక రంగానికి చెందిన చలసాని కృష్ణ ప్రసాద్, హేమాద్రి వర ప్రసాద్ ప్రసంగించారు.

అనంతరం అతిథులు వెబ్ సైట్‌ను ప్రారంభించారు. నాటక రంగానికి చెందిన కేకేఎల్ స్వామి, శ్రీనివాస్‌ను సత్కరించారు. అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి అగ్ని సంస్కారం నాటికను ప్రదర్శించారు. ఆహూతులను అలరించింది. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దాళ్వా పంటలకు ఈ క్రాప్ చేయించుకోవాలి

విజయవాడరూరల్: దాళ్వా పంటలకు రైతులు ఈ–క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ(ఓటీపీ–వేలిముద్రల ద్వారా పంట వివరాల ధ్రువీకరణ) ఈ నెల 20వ తేదీలోపు చేయించుకోవాలన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట ఉత్పత్తుల కొనుగోలు, పంట నష్టం, పంటల బీమా, పంట రుణాలు వంటి పథకాల లబ్ధి పొందాలంటే ఈ క్రాప్ తప్పదని సూచించారు. మండలంలో 3,200 ఎకరాల్లో దాళ్వా పంటను ఈ–క్రాప్ చేశారని, మిగిలిన రైతులు కూడా చేయించుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనచోదకులు తీవ్రంగా గాయపడ్డారు. కేవీస్ టాకీస్ రోడ్డు సెంటర్ వద్ద యూటర్న్ తిరుగుతున్న ద్విచక్రవాహనచోదకుడు కొత్తూరు శివను హనుమాన్‌జంక్షన్ వైపు నుంచి బైక్‌పై వేగంగా వస్తున్న బడుగు తంబి ఢీకొట్టాడు. దీంతో వీరిద్దరి తలలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. స్థానికులు హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచనల మేరకు 108 అంబులెన్స్‌లో చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తీసుకువెళ్లారు. బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన కొత్తూరు శివ, బడుగు తంబి ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

మినీ వ్యాన్ చోరీ

పెనమలూరు: కానూరులో మినీవ్యాన్ చోరీ జరగడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు శ్రీనగర్‌కాలనీలో ఎండీ రిజ్వాన్ నివసిస్తున్నాడు. అతను ట్రాన్స్‌పోర్టు వ్యాపారి. అతను గత నెల 26న వ్యాన్‌ను ఇంటి ఎదుట నిలిపాడు. తెల్లవారి చూసుకోగా గుర్తు తెలియని వ్యక్తులు వ్యాన్‌ను చోరీ చేశారు. పలుచోట్ల వెదికినా ఫలితం లేదు. వ్యాన్ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై వారు కేసు నమోదు చేశారు.

రేపు ఉచిత 'బోన్' పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎముకలకు సంబంధించి గురువారం చుట్టుగుంట డాక్టర్ చల్లా హరికుమార్ హాస్పిటల్‌లో ఉచిత బోన్ ఫంక్షన్ (బీఎండీ) పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ చల్లా హరికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనపై దృష్టి



సమావేశంలో ఎంపీడీవో ప్రభాకరరావు, ఎంపీపీ నగేష్, వైస్ ఎంపీపీ రమాదేవి

హనుమాన్‌జంక్షన్ రూరల్: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అన్నారు. స్థానిక మహాత్మాగాంధీనగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారులు, తాగునీటి కుళాయిలు, విద్యుత్ కనెక్షన్ల ఏర్పాట్లపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని చెప్పారు. డ్వాక్రా రుణాల మంజూరుకు సభ్యుల నుంచి అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలను పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో లేవనెత్తారు. దీనిపై ఎంపీపీ యర్రగొర్ల నగేష్ స్పందిస్తూ ఇలాంటి వాటిని సహించబోమని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెలా ఏదో గ్రామంలో డ్వాక్రా మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎంపీడీవో ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వాసా వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ ఎ.వెంకటేశ్వరరావు, ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో అశోక్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోడవరానికి సిటీ సర్వీసు



చోడవరంలో సిటీ సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: చోడవరం గ్రామస్తుల అవసరాలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేకంగా ఆర్టీసీ సిటీ బస్సు వేయించారు. గ్రామంలో ఉదయం 8 గంటలకు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు పెనమలూరు, విజయవాడ వైపునకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పార్థసారథి గ్రామంలో పర్యటించినప్పుడు సిటీ బస్సు సర్వీసు ఉదయం 8 గంటలకు కావాలని గ్రామస్తులు కోరారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక సర్వీసు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యేకు, ఆర్టీసీ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు



ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ రంగారావు

రామవరప్పాడు: ప్రాధాన్యతాక్రమంలో గ్రామంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. రూరల్ మండలం నిడమానూరు నెహ్రూనగర్‌లో సుమారు రూ 10 లక్షలతో జరుగుతున్న అంతర్గత రహదారి, సిమెంట్ డ్రెయిన్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. రంగారావు మాట్లాడుతూ గ్రామంలో సుమారు కోటి రూపాయలకు పైగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతం, రామానగర్‌లో అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట్ల మోటారు బోర్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో చేయాల్సిన పనులు గుర్తించామని వాటిని కూడా అతి త్వరలో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రసూల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమంత్ పాల్గొన్నారు.

నున్నకు కృష్ణా జలాలు



నున్నలో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.వెంకటరమణ, అధికారులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామానికి కృష్ణా జలాల ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ నున్నలో జలజీవన్ మిషన్ గ్రాంటు తో జరిగే పనులను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో మంగళవారం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.వెంకటరమణ ఆధ్వర్యాన అధికారుల బృందం జేజేఎం పనులను పరిశీలించి గ్రామస్తుల విజ్ఞప్తిపై ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ గ్రాంటు కింద అదనంగా ఇచ్చిన రూ.3.50కోట్ల నిధులను నున్న, బోడపాడు, విశ్వబ్రాహ్మణ కాలనీల్లో మెరుగైన తాగునీటి సరఫరాకు వినియోగించనున్నారు. దీనిలో భాగంగా కృష్ణానది జలాలను తాగునీటిగా సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈ.. అధికారులను ఆదేశించారు. డీఈ దయానంద్, సర్పంచి కాటూరి సరళశ్రీనివాస్, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజని, వార్డు సభ్యులు యర్కారెడ్డి వెంకటరెడ్డి, కాటూరి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బస్సులు సకాలంలో నడపండి

ఆర్‌ఎంకు సనత్‌నగర్‌వాసుల విజ్ఞప్తి

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌కు సిటీ బస్సులు సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆక్సా మసీదు కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు కోరారు. మంగళవారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ డీవై దానంకు వినతిపత్రం ఇచ్చారు. సనత్‌నగర్‌కు 30ఎస్ సిటీ సర్వీసు తిరుగుతుందన్నారు. ఇది నిర్ణీత సమయాల్లో రాక పోవడంతో విద్యార్థులు, వ్యాపారులు, స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ సనాఉల్లా, కార్యదర్శి మునీర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నేతల ఎండి.సిద్దిఖ్, మీరా,సాబు, ఖలీల్, మగ్బుల్ పలువురు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్యసేవలు భేష్

- హెర్నియా, హైడ్రోసిల్, ఫైల్స్ సర్జరీలు అందుబాటులో
- కంకిపాడులో నిత్యం 250–300 మందికి వైద్యం

నెలకు	అందిస్తున్న సేవలు
రక్త పరీక్షలు	: 4000–5000
ఓపీ	: 8000–9000
ఎక్స్‌రే	: 200
ప్రసవాలు	: 25
కు.ని.ఆపరేషన్లు	: 15–20
సర్జరీలు	: 10



కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం

కంకిపాడు: కంకిపాడు సామాజిక ఆరోగ్యకేంద్రంలో సాధారణ వైద్యంతో పాటు శస్త్ర చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ అందుతున్న వైద్య సేవల పై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్

పట్టణంలోని పాత వాటర్ ట్యాంకు సమీపంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నడిచేది. 2010 తర్వాత పీహెచ్‌సీలో అందుతున్న సేవల రీత్యా సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ అయ్యింది. గైనికాలజీ, పిడియాట్రిక్, మత్తు, జనరల్, జనరల్ సర్జరీ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ఎనిమిది మంది నిపుణులైన వైద్యులు సేవలు అందిస్తున్నారు. వీరితో పాటు వైద్య సిబ్బంది, సెక్యూరిటీ, ఇతర కార్మికులతో కలిపి 43 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు.

ప్రతి రోజూ 300 ఓపీ

కంకిపాడుతో పాటుగా పెనమలూరు, తోట్లవల్లూరు, ఉయ్యూరు పరిసరాల నుంచి రోగులు నిత్యం వైద్య సేవల కోసం వస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీహెచ్‌సీలో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. తాజాగా టెక్నీషియన్ పోస్టు భర్తీకావటంతో ఎక్స్‌రే సేవలు అందుతున్నాయి. పది బెడ్లతో వార్డు అందుబాటులో ఉంది. ప్రసవాలు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు సమర్థంగా అందిస్తున్నారు. వీటితో పాటుగా హెర్నియా, హైడ్రోసిల్, ఫైల్స్, 24 గంటల కడుపునొప్పికి కూడా సర్జరీలు చేసే నిపుణులు అందుబాటులో ఉన్నారు. దీంతో రోజూ సాధారణ, ఇతర ప్రత్యేక వైద్య సేవలకు 250 నుంచి 300 మందికి తగ్గకుండా రోగులు సీహెచ్‌సీకి వస్తున్నారు.

రక్తనిల్వ కేంద్రం

ఉన్నతాధికారుల చొరవతో రక్తనిల్వ కేంద్రం సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఆరు యూనిట్ల రక్తం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి రెండునెలలకు ఒక పర్యాయం రక్తదాన శిబిరాలు నిర్వహించి అవసరమైన రక్తం సేకరించి మచిలీపట్నం ప్రధాన ఆసుపత్రికి పంపటం, అక్కడ అన్ని రకాల పరీక్షలు అనంతరం సురక్షితమైన రక్త నమూనాలను ఇక్కడికి పంపడంచేస్తున్నారు.

సమర్థంగా వైద్యం



సాధారణ, సర్జరీ, గైనికాలజీ, దంత, పిడియాట్రిక్, మత్తు వైద్య సేవలు అందుతున్నాయి. టీబీ రోగులకు, పాము, కుక్క కాటు మందులు, సాధారణ వ్యాధులకు ఇతర సీజనల్ వారీగా మందులు కొరత లేకుండా అందుబాటులో ఉంచాం. హెర్నియా, హైడ్రోసిల్, ఫైల్స్, ఇతర సర్జరీలు అందుబాటులోకి తెచ్చాం.

– డాక్టర్ సంజయ్, వైద్యాధికారి, సీహెచ్‌సీ, కంకిపాడు

వైద్య సేవలకు పెద్ద పీట



గ్రామీణ ప్రాంతంలోని ఆసుపత్రులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎక్స్‌రే సేవలు, సర్జరీలు అందుతున్నాయి. గతంతో పోలిస్తే సేవలు మెరుగ్గా అందుతున్నాయి.ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

– మేడంగ్రావు కుటుంబరావు, చైర్మన్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ